క్లుప్తంగా

ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లెలో కొలువైన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆశ్వీజమాసం మూడవ శనివారం సందర్భంగా వేకువజాము నుంచి స్వామి వారికి ప్రత్యేక అభిషేకం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తుల దర్శనార్థం స్వామివారు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకుని కాయకర్పూరం సమర్పించుకున్నారు. ఆలయ పూజారి పెంచలయ్యస్వామి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రొద్దుటూరు కల్చరల్ : ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని జిల్లా ఆసుపత్రి ఆయుర్వేద వైద్యురాలు ఎస్.అపర్ణ పేర్కొన్నారు. స్థానిక వెంకటేశ్వర్లపేట సరస్వతీ విద్యామందిరంలోని మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ కార్యాలయంలో శనివారం ప్రభుత్వ ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులను పరీక్షించి ఆయుర్వేద మందులను పంపిణీ చేశారు. కీళ్లనొప్పులు, జ్వరం, జలుబు, దగ్గు, ఆయాసం, గ్యాస్ట్రబుల్ తదితర సమస్యలు ఉన్న 61 మంది ఈ వైద్యశిబిరంలో వైద్య సేవలు పొందారు. కార్యక్రమంలో మానవత గౌరవాధ్యక్షుడు ఎస్.శ్రీనివాసులు, అధ్యక్షురాలు చిట్టెం రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఏటీఎం సెంటర్‌లో అగ్నిప్రమాదం

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరులోని గాంధీరోడ్డులో ఉన్న ఇండియన్ బ్యాంక్ ఏటీఎం సెంటర్‌లో శనివారం సాయంత్రం అగ్నిప్రమాదం జరిగింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగినట్లు అగ్నిమాపక అధికారులు తెలిపారు. ఏటీఎం సెంటర్‌లోని ఏసీలు కాలిపోయాయి. పెద్ద ఎత్తున మంటలు రావడంతో అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు.

కాశినాయన ఎస్‌ఐగా అమర్‌నాథ్‌రెడ్డి



కాశినాయన : కాశినాయన ఎస్‌ఐగా అమర్‌నాథ్‌రెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈయన ప్రొద్దుటూరు 1టౌన్ ఎస్‌ఐగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న హరిప్రసాద్ బదిలీపై వెళ్లారు.

నూతన భవనానికి శంకుస్థాపన



నూతన భవనానికి శంకుస్థాపన చేస్తున్న విశ్రాంత ఉద్యోగులు

పోరుమామిళ్ల : పట్టణ నడిబొడ్డున ఉన్న శ్రీ రామచంద్రా రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో శనివారం పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు నూతన భవనానికి శంకుస్థాపన చేశారు. దశాబ్దాల క్రితం నిర్మించిన రూము శిథిలావస్థకు చేరడం, రోడ్డు విస్తరణ కారణంగా పాతభవనం కొంత తొలగించాల్సి ఉండటంతో నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

లక్కీడిప్ విజేతల ఎంపిక

మైదుకూరు : మైదుకూరు ఆర్టీసీ డిపో బస్సుల్లో ప్రయాణించే వారి కోసం డిపో అధికారులు ఏర్పాటు చేసిన లక్కీడిప్ గిఫ్ట్ స్కీం విజేతలను శనివారం ఎంపిక చేశారు. అక్టోబర్ 16 నుంచి 31వ తేదీ వరకు మైదుకూరు - గిద్దలూరు, కడప-పోరుమామిళ్ల రూట్లలో ప్రయాణించిన వారిలో విజేతలను ఎంపిక చేశారు. కార్యక్రమానికి అతిథులుగా పాల్గొన్న స్థానిక జెడ్పీ హైస్కూల్ (బాయ్స్) ఇన్‌చార్జి హెడ్మాస్టర్ మణిప్రకాష్, ఉపాధ్యాయుడు మునెయ్య ప్రయాణికుల టికెట్ల నుంచి విజేతలను ఎంపిక చేశారు. మైదుకూరు-గిద్దలూరు రూట్‌లో సాయివాణి, నవీన్, సారథి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను గెలుచుకున్నారు. కడప-పోరుమామిళ్ల రూట్‌లో అనిల్ కుమార్, శ్రీదేవి, మేరి మొదటి, రెండో, మూడో బహుమతులకు ఎంపికయ్యారు. డిపో మేనేజర్ శ్రీనివాసరావు, ఎస్‌టీఐ మంజుల, అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ ఉద్యోగికి గాయాలు

కడప కార్పొరేషన్: విద్యుత్ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న షేక్ గౌస్ బాషా రోడ్డు ప్రమాదానికి గురై గాయలపాలయ్యాడు. కడప నగరానికి చెందిన గౌస్ బాషా తాను పనిచేస్తున్న వల్లూరుకు ద్విచక్ర వాహనంలో వెళుతుండగా మార్గమధ్యంలో ఆవును ఢీకొని కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో గౌస్ బాషాకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం ఆయన్ను రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.

ఇరువురినీ తోబుట్టువులా భావిస్తున్నా

- మహిళల ఆత్మగౌరవాన్ని కించపరచలేదు
- ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రవీణ్ కుమార్‌రెడ్డి సతీమణి మౌనిక, నందం సుబ్బయ్య సతీమణి అపరాజితలు తనకు తోబుట్టువులాంటి వారని, వారి ఆత్మగౌరవాన్ని కించపరిచే పని ఎన్నటికీ చేయనని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజకీయంగా వారికి సమాధానం ఇవ్వాల్సిన అవసరం లేకపోయినా ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం తనకు ఉందన్నారు. తానే కాదు వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీలో ఏ ఒక్కరికీ మిమ్మల్ని కించపరిచే ఉద్దేశం లేదన్నారు. మీ ఆత్మ గౌరవానికి భంగం కలిగించే పనులు ఎప్పటికీ చేయనని, తనకు అమ్మ, భార్య, బిడ్డలు ఉన్నారన్నారు. నందం సుబ్బయ్య హత్య కేసులో బెనర్జీ నిందితుడు కాబట్టి నందం అపరాజిత, ప్రవీణ్ కుమార్ రెడ్డి కలిసి ఈ హత్యాప్రయత్నం చేశారని దళిత నాయకుడు గోసా మనోహర్ చెప్పడం జరిగిందన్నారు. అంతే తప్ప మరో ఉద్దేశం లేదని తెలిపారు. తన తోపాటు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు మహిళల వ్యక్తిగత జీవితాల గురించి ఏ రోజు మాట్లాడలేదన్నారు. ఒక వేళ అపరాజిత తప్పుగా అర్థం చేసుకుని ఉంటే తమను మన్నించాలని కోరారు. అపరాజిత ప్రేరేపించడం వల్లే ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఇలా చేశారని బెనర్జీ తల్లిదండ్రులు సైతం ఆరోపించారన్నారు. నందం సుబ్బయ్య హత్యలో ఎమ్మెల్యేకు సంబంధం ఉందని ప్రచారం చేయడమేగాకుండా తనపై సీబీఐ విచారణ కూడా అపరాజిత కోరిందన్నారు. అంత మాత్రాన తాను నిందితుడిని కాదని, నిజం నిర్ధారణ తర్వాత వాస్తవాలు వెల్లడవుతాయన్నారు. ప్రవీణ్ సతీమణి మౌనిక మాట్లాడుతూ స్త్రీలను అగౌరవపరిస్తే పతనం కాక తప్పదని చెప్పిందన్నారు. ఇది నూటికి నూరుపాళ్లు నిజమేనని తెలిపారు. బెనర్జీపై హత్యాయత్నం జరిగిన రెండు మూడు నిమిషాలకే నిందితులు ప్రవీణ్‌కు ఎందుకు ఫోన్ చేశారని ప్రశ్నించారు. ఈ సంఘటనతో సంబంధం లేకుంటే ఎందుకు ప్రవీణ్ ఇంత వరకు పోలీసులకు దొరకలేదన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, కౌన్సిలర్లు చింతకుంట సరితా రెడ్డి, గరిశపాటి లక్ష్మీదేవి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ

మండలంలోని గోపవరం గ్రామ పంచాయతీ హౌసింగ్ బోర్డు కాలనీలో రూ.11 లక్షలతో చేపట్టే సిమెంటు రోడ్డు నిర్మాణ పనులకు శనివారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అన్ని మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ గద్ద మోషా, మాజీ సర్పంచ్ దేవీ ప్రసాద్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఓబయ్య యాదవ్, కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి, ఎంపీటీసీ వసుంధర, మార్కెట్ యార్డు డైరెక్టర్ గోకుల మేరి, వైఎస్సార్‌సీపీ నాయకులు గంజికుంట శివారెడ్డి, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు ఆస్తుల పరిశీలన



వక్ఫ్‌బోర్డు స్థలాలను పరిశీలిస్తున్న జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ వసీం అక్రం

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు ప్రాంతంలోని వక్ఫ్‌బోర్డు ఆస్తులను ఇన్సాఫ్ జిల్లా కార్యదర్శి షరీఫ్ ఫిర్యాదు మేరకు శనివారం జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ వసీం అక్రం పరిశీలించారు. ఈ సందర్భంగా వసీం అక్రం మాట్లాడుతూ కొత్తపల్లె పంచాయతీ కార్యదర్శి గురుమోహన్‌తో కలిసి పంచాయతీ పరిధిలోని వక్ఫ్‌బోర్డు భూములకు సంబంధించి చర్చిస్తామన్నారు. పంచాయతీలోని కొత్తపల్లె, మోడంపల్లె గ్రామాల పరిధిలో వక్ఫ్ భూములు ఉన్నాయన్నారు. వక్ఫ్‌బోర్డుకు సంబంధించిన ఎంజీ ఆటోనగర్‌లో 565 సర్వే నంబర్‌లో 73 సెంట్లను కొందరు ఆక్రమించారని తెలిపారు. ఆ భూమిని సర్వే చేసి హద్దులు నిర్ణయిస్తామన్నారు. సర్వే నంబర్ 278/లో 1.02 ఎకరాల వక్ఫ్‌భూమిని కొందరు ఆక్రమించి ఇళ్లు నిర్మించుకున్న వారికి పంచాయతీ నుంచి నోటీసులు ఇచ్చామన్నారు. ఇప్పటికే రెండు నోటీసులు ఇచ్చామని, త్వరలో మూడో నోటీసు ఇచ్చి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

బహుమతి అందజేత

ప్రొద్దుటూరు : స్థానిక ఆర్టీసీ డిపో కార్గో పాయింట్‌లో డోర్ డెలివరీ మాసోత్సవంలో భాగంగా శనివారం లక్కీడ్రాలో గిఫ్ట్ పొందిన బి.సుభాష్‌కు డిపో మేనేజర్ మల్లికార్జునరెడ్డి, సీఐ లావణ్య బహుమతి అందించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ డోర్ డెలివరీ మాసోత్సవంలో భాగంగా కొత్తాస్ వారి సహకారంతో డోర్ డెలివరీ చేయించుకున్న వారికి గిఫ్ట్ స్కీం ప్రవేశపెట్టామన్నారు. కస్టమర్లు బాక్స్‌లో తమ పేరు, ఫోన్ నంబర్ రాసి బాక్స్‌లో వేయాలని తెలిపారు.

ఉచిత శిక్షణ

ప్రొద్దుటూరు : ఈనెల 5వ తేదీ నుంచి వారం రోజులపాటు బ్యూటీ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్నేహ సేవా సమితి అధ్యక్షుడు బి.మధుసూదన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు రెండు గంటలపాటు శిక్షణ ఇస్తారని, శిక్షణ అనంతరం నిర్వహించే పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్లు అందిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు 98853 39306కు సంప్రదించాలని కోరారు.

నేటి నుంచి అవధూత కొండయ్య స్వామి జన్మదిన వేడుకలు

మైదుకూరు : మైదుకూరు మున్సిపాలిటీలోని తిమ్మాయపల్లెలో ఆదివారం నుంచి మూడు రోజులపాటు అవధూత కొండయ్య స్వామి జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్నట్లు భక్త బృందం ఒక ప్రకటనలో తెలిపింది.

గ్రామంలో ఊసయ్య గారి ఆశ్రమంలో 5వ తేదీ ఆదివారం కొండయ్య స్వామి జన్మదిన వేడుకల సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రాత్రి 9 గంటలకు జబర్దస్త్ కార్యక్రమం, ఆర్కెస్ట్రా, 10 గంటలకు పౌరాణిక నాటకాల ప్రదర్శన ఉంటాయని వివరించారు. 6, 7 తేదీల్లో బండలాగుడు పోటీలు నిర్వహిస్తామని, ఈ వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

'ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి'ని విజయవంతం చేయండి

గోపవరం : ఈనెల 9వ తేదీ నుంచి 17వ తేదీ వరకు నిర్వహించే ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గోపవరం మల్లికార్జునరెడ్డి తెలిపారు. 9వ తేదీ బేతాయపల్లె, 10న బ్రాహ్మణపల్లె, 14న గోపవరం, 15న కాలువపల్లె, 16న రాచాయపేట, 17వ తేదీన టీ.సంద్రపల్లె సచివాలయ పరిధిలో నిర్వహించే ఈ కార్యక్రమానికి సచివాలయ సిబ్బందితో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

జిల్లా స్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు డీపీఎస్ విద్యార్థులు ఎంపిక

చాపాడు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కడపలోని విద్యా మందిర్‌లో జరిగిన బాస్కెట్ బాల్ ఎంపికలలో స్థానిక ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు అండర్-14, అండర్-17 విభాగాల్లో జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు చైర్మన్ వి.జయచంద్రారెడ్డి తెలిపారు.

అండర్-14 విభాగంలో పి.శ్రీనికేతన్, జె.శర్వాణి, అండర్-17లో డి.తన్మయిరెడ్డిలు ఎంపికయ్యారు. తమ స్కూల్ విద్యార్థులు జిల్లా బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికవడం పట్ల పాఠశాల డైరెక్టర్ లోహిత్, ఉపాధ్యాయ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

చెకుముకి సైన్స్ సంబరాలను జయప్రదం చేయాలి

కలసపాడు : జన విజ్ఞానవేదిక నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ సంబరాలను జయప్రదం చేయాలని ఆ సంస్థ జిల్లా కార్యవర్గ సభ్యులు ఖాసీంవల్లి, పోరుమామిళ్ల మండల కార్యదర్శి గురయ్యలు పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు హైస్కూల్‌లను సందర్శించి ప్రధానోపాధ్యాయులకు హెచ్.ఎం. నోట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జేవీవీ ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీన పాఠశాల స్థాయిలో, 30వ తేదీన మండల స్థాయిలో, డిసెంబర్ 17వ తేదీన జిల్లాస్థాయిలో పరీక్షలు ఉంటాయన్నారు. 8,9,10వ తరగతుల విద్యార్థులందరూ ఈ పరీక్షల్లో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

సానుభూతి ఓట్ల కోసం దుష్ప్రచారం చేస్తున్నారు

ప్రొద్దుటూరు : సానుభూతి ఓట్ల కోసమే టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ నాయకులపై దుష్ప్రచారం చేస్తున్నారని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోసా మనోహర్ తెలిపారు. ఆయన శనివారం మున్సిపల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ నందం సుబ్బయ్య హత్య కేసులో నిందితుడిగా ఉన్న బెనర్జీని హత్య చేయాలని నందం అపరాజిత, టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి కుట్ర పన్నినట్లు తాను తెలిపానన్నారు. అంతే తప్ప అపరాజితను ఉద్దేశించి తాను ఏమి మాట్లాడలేదన్నారు. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డితోపాటు పార్టీ నాయకులు మహిళల పట్ల ఎంతో గౌరవంగా ఉంటారన్నారు. కేవలం సానుభూతి కోసమే వారు ఇలా ప్రచారం చేశారని తెలిపారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కింగ్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

గుండె పోటుకు అత్యవసర వైద్యం



గుండె పోటు వచ్చిన వ్యక్తికి స్టెంట్ అమరుస్తున్న వైద్యులు

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరులోని జమ్మలమడుగు రోడ్డులో కొత్తగా ఏర్పాటు చేసిన ధ్రితి గుండె, ప్రసూతి ఆస్పత్రిలో క్యాథ్‌ల్యాబ్ సౌకర్యం ప్రారంభించినట్లు డాక్టర్ వెంకటచెంచెయ్య శనివారం తెలిపారు. మండలంలోని దొరసానిపల్లెకు చెందిన 55 ఏళ్ల వ్యక్తి గుండె నొప్పి, ఆయాసం రావడంతో తమ ఆస్పత్రికి వచ్చాడన్నారు. అతనికి యాంజియోగ్రామ్ ద్వారా గుండె పోటు అని నిర్ధారణ చేసి ఇంజెక్షన్ ట్రీట్‌మెంట్ లేకుండానే గంటలోపే కొరనరీ రక్తనాళాల్లో స్టెంట్‌ను అమర్చినట్లు తెలిపారు. గుండె నొప్పి వస్తే అశ్రద్ధ చేయరాదని, వెంటనే గంటలోపు స్టెంట్‌ను అమర్చగలిగితే గుండె పటుత్వాన్ని 100 శాతం కాపాడవచ్చన్నారు.

స్నేహపూర్వక సేవలు అందించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : బ్యాంకు సిబ్బంది ప్రజలకు స్నేహ పూర్వక సేవలు అందిస్తూ నిజాయితీగా విధులు నిర్వర్తించాలని జిల్లా అడిషనల్ ఎస్పీ ఎస్ఎస్‌వీ కృష్ణారావు పిలుపునిచ్చారు. శనివారం కడప నగరంలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో అవినీతికి వ్యతిరేకంగా అవగాహన వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత బ్యాంకు చైర్మన్ రాకేష్ కశ్యప్ సిబ్బంది చేత అవినీతికి వ్యతిరేకంగా ప్రమాణం చేయించారు. అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ కరోనా సమయంలో బ్యాంకు సిబ్బంది అందించిన సేవలు ప్రశంసనీయమన్నారు. బ్యాంకు సీఈఓ, జనరల్ మేనేజర్ సంజీవప్ప మాట్లాడారు. బ్యాంకు జీఎంలు, చీఫ్ మేనేజర్లు పాల్గొన్నారు.

దేశ పురోగతికి అవినీతి ప్రధాన అవరోధం



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న ఏపీజీబీ మేనేజర్ శైలజ

చాపాడు : దేశ పురోగతికి అవినీతి ప్రధాన అవరోధమని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్ పి.శైలజ అన్నారు. మండల పరిధిలోని చిన్నగురువళూరు గ్రామంలో స్వామి వివేకానంద విద్యా నికేతన్‌లో శనివారం ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు విజిలెన్స్ అవగాహన వారోత్సవాల సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజ అభివృద్ధికి విద్యార్థులు తమ వంతుగా కృషి చేస్తూ అన్ని రంగాలలో రాణించాలన్నారు. అవినీతికి ప్రతి ఒక్కరూ దూరంగా ఉంటేనే దేశానికి మంచి జరుగుతుందన్నారు. వివేకానంద విద్యా నికేతన్ కరస్పాండెంట్ నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ అవినీతి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కలసికట్టుగా పని చేయాలన్నారు. అనంతరం మన దేశ పురోగతికి అవరోధం అవినీతి అనే అంశంపై నిర్వహించిన వ్యాస రచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మంచి, చెడు స్పర్శ గురించి తెలుసుకోవాలి



మాట్లాడుతున్న సునీత

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థినులు మంచి స్పర్శ, చెడు స్పర్శల గురించి తెలుసుకోవాలని బాలల పరిరక్షణ విభాగం లీగల్ ప్రొటెక్షన్ ఆఫీసర్ జి.సునీత పేర్కొన్నారు. మండల పరిధిలోని దొరసానిపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శనివారం విద్యార్థినులకు బాల్య వివాహాల వల్ల కలిగే దుష్పరిణామాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చేసుకోవడం వల్ల భవిష్యత్‌లో ఎదుర్కొనే ఆరోగ్య సమస్యలు, ఇతర సమస్యలను వివరించారు. మహిళా పోలీస్ అపర్ణ సెల్‌ఫోన్ అధికంగా వాడటం వల్ల కలిగే ఇబ్బందులు, శారీరక, మానసిక రుగ్మతల గురించి విద్యార్థినులకు వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కొండారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బద్వేలును కరువు నియోజకవర్గంగా ప్రకటించాలి



బసనపల్లెలో ఎండిపోతున్న పంటలను పరిశీలిస్తున్న రైతు సంఘాల నాయకులు

కాశినాయన : బద్వేలు నియోజకవర్గాన్ని కరువు నియోజకవర్గంగా ప్రకటించాలని రైతు సంఘాల నాయకులు మస్తాన్, చంద్రమోహన్‌రాజు, సుబ్బారెడ్డిలు కోరారు.

శనివారం మండలంలోని బసనపల్లె, ఆనంవారిపల్లె, కోడిగుడ్లపాడు గ్రామాల్లోని వర్షాధారం కింద సాగు చేసిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల వలన పంటలు ఎండిపోతున్నాయని, ప్రభుత్వం కరువు నియోజకవర్గంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఆప్కాస్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

ప్రొద్దుటూరు : మండలంలోని గోపవరం పశువైద్య కళాశాల ఆప్కాస్ ఉద్యోగులు శనివారం ఆప్కాస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ కళ్యాణ చక్రవర్తిని పోరుమామిళ్లలోని ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం ఇచ్చారు.

ఈ సందర్భంగా కళాశాల ఆప్కాస్ యూనియన్ ప్రెసిడెంట్ ఆర్.సుబ్బారావు మాట్లాడుతూ ప్రొద్దుటూరు పశువైద్య కళాశాలలో 2008 నుంచి 2023 వరకు పనిచేస్తున్న 109 మంది ఆప్కాస్ ఉద్యోగులను క్రమబద్ధీకరించడం కానీ, కాంట్రాక్టు కింద తీసుకోవడం కానీ జరగలేదన్నారు. ఆప్కాస్ ఉద్యోగులందరిని పర్మినెంట్ చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సెక్రటరీ వి.పెద్దన్న, ట్రెజరర్ ఆర్ఎం కుమార్, సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు



నిర్మాణాలు చేస్తున్న కబ్జాదారులు



తహసీల్దారు పేరుతో హెచ్చరిక బోర్డు

పోరుమామిళ్ల : రంగసముద్రం పంచాయతీలోని ప్రభుత్వ భూములు కబ్జాదారుల అక్రమ సంపాదనకు అడ్డాగా నిలిచాయి. అధికారులకు ఆరునెలలకు ఒకసారి చలనం వచ్చి ఆక్రమణలపై హెచ్చరికలు చేసినా కొద్దిరోజులకు మళ్లీ కబ్జాలు మొదలవుతున్నాయి. ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయకపోవడం, సమస్యను సీరియస్‌గా తీసుకోకపోవడం వల్ల రంగసముద్రం పంచాయతీలో కోట్ల రూపాయల విలువచేసే వందలాది ఎకరాలు అన్యాక్రాంతమవుతున్నాయి.

తాజాగా సుందరయ్యకాలనీలో బేసుమట్టాలు తీసి నిర్మాణాలు మొదలు పెట్టారని ఆరోపణలు వచ్చాయి. 3 నెలల క్రితమే ఆర్‌డీఓ వెంకటరమణ ఆ ప్రాంతాన్ని పరిశీలించి అక్కడ సర్వేనెంబర్ 1283లో కొన్ని ప్లాట్లల్లో ఎవరికీ పట్టాలు ఇవ్వలేదని నోటీసు బోర్డు పెట్టారని, తిరిగి ఇప్పుడు ఆ ప్రాంతంలో నిర్మాణాలు చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయమై తహసీల్దారు గంగయ్యను విచారించగా ఆక్రమణల గురించి తెలుస్తూనే ఆ ప్రాంతం వెళ్లి ఇటీవల కాలంలో అక్రమంగా ఆక్రమించుకుని కట్టుకున్న దాదాపు 150 ఇళ్లను(గుడిసెలను) కూలదోశామన్నారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు నిర్విరామంగా యంత్రాలతో అక్రమ కట్టడాలను తొలగించామన్నారు. వాటిల్లో కొన్ని 2014 నుంచి ఆక్రమించుకున్నవి కూడా ఉన్నాయన్నారు. ఎస్టీకాలనీ స్మశానం కొరకు ఆక్రమించుకున్న స్థలం స్వాధీనం చేసుకున్నామన్నారు. గుడిసెలకు సంబంధించిన వారు తాము పేదలమని, ఇండ్లు కూలగొడితే ఎలా అని అడగ్గా, వారికి మీరు దరఖాస్తు చేసుకోండి జగనన్న కాలనీలో ఇంటిస్థలంతో పాటు నిర్మాణానికి ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. ఇలా అక్రమించుకోవడం చట్టపరంగా నేరమన్నారు. వారం రోజుల్లో మళ్లీ ఆ ప్రాంతం పరిశీలిస్తామన్నారు. ఎక్కడెక్కడ ఆక్రమణలు జరిగాయో వాటన్నింటిని తొలగించి ఆ స్థలం స్వాధీనం చేసుకుంటామన్నారు.

ముగిసిన కుటుంబ ఆరోగ్య సర్వే

ప్రొద్దుటూరు క్రైం : జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాల్లో జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-6 నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రొద్దుటూరు మండలంలోని గోపవరం రెండవ, మూడవ సచివాలయాల్లో గత ఎనిమిది రోజుల నుంచి జిల్లా కోఆర్డినేటర్ లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఆరుగురు సభ్యుల బృందంతో హైదరాబాద్‌లోని సిగ్మా రీసెర్చ్ సంస్థ సర్వే చేసింది. ఈ కార్యక్రమం శనివారం ముగిసినట్లు వైద్యాధికారులు తెలిపారు. సర్వేలో కుటుంబ సభ్యుల ఆరోగ్య పరమైన వివరాలతో పాటు ఆర్థిక పరిస్థితి, మౌళిక సదుపాయాలపై సర్వే నిర్వహించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ కృష్ణమ్మ, హెచ్ఈ శోభారాణి, సూపర్‌వైజర్లు బీఏ వరప్రసాద్, చంద్రకళ, యంఎల్‌హెచ్‌పీలు బబీ, నాగేంద్ర, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.